కూరగాయల ధరలు

శేరిలింగంపల్లి: నల్లగండ్ల మార్కెట్‌లో .. టమాట 15, పచ్చిమిర్చి 50 , బెండ 35, కాకర 60, దొండ 35, దోస 40, ఆలు 30, చామ 60, కీర 40, బీర 60, వంకాయ 40, గోకర 50, బీన్స్ 150, బీట్‌రూట్ 40, క్యాప్సికమ్ 60, క్యాబేజీ 15, క్యారెట్ 40, చిక్కుడు 90, ఉల్లి 25(కేజీ), ములక్కాయలు (2) 10 , క్యాలీఫ్లవర్ (1) 30.

సమ్మె పోస్టర్ విడుదల

పటాన్‌చెరు టౌన్: లేబర్‌కోడ్‌లపై కేంద్ర ప్రభుత్వం వెనక్కి తగ్గకపోతే నిరవధిక సమ్మె తప్పదని సీఐటీయూ రాష్ట్ర కమిటీ సభ్యులు రాజయ్య హెచ్చరించారు. ఈనెల 20న జరిగే దేశవ్యాప్త సమ్మెను పురస్కరించుకొని పటాన్‌చెరులోని అగర్వాల్ పరిశ్రమలో కార్మికులతో కలిసి శనివారం సమ్మె పోస్టర్‌ను విడుదల చేశారు.ఈ సందర్భంగా రాజయ్య మాట్లాడుతూ... లేబర్ కోడ్‌లు ఎట్టి పరిస్థితుల్లో దేశంలో అమలు చేయకూడదని, లేబర్ కోడ్‌లపై కార్మిక వర్గం తిరుగుబాటు తప్పదని హెచ్చరించారు. అవసరమైతే నిరవధిక సమ్మె సైతం ఆలోచిస్తామన్నారు. రైతులు పోరాడినట్టుగా కార్మికులు కూడా పోరాడాలని, దానికి అందరూ సిద్ధం కావాలని ఆయన పిలుపునిచ్చారు. లేబర్ కోడ్‌లు వస్తే పనిగంటలు ఉండవని, ఈఎస్ఐ, పీఎఫ్ చట్టాలు అమలు కావని ఆయన చెప్పారు. కార్మికులందరూ సమ్మెలో అధిక సంఖ్యలో పాల్గొనాలని కార్మిక వర్గానికి పిలుపునిచ్చారు. కార్మిక సంఘం నాయకులు రామకృష్ణ ,సత్యనారాయణ, రవీంద్రుడు పాల్గొన్నారు.

ఎఫ్‌డీడీఐలో విన్నూత్న కార్యక్రమం



రాయదుర్గం: ఫుట్‌వేర్ డిజైన్ అండ్ డెవలప్‌మెంట్ ఇన్‌స్టిట్యూట్–హైదరాబాద్‌లో వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. 'యంగ్ మైండ్స్ ఎక్స్‌ప్లోర్ డిజైన్ హారిజన్స్ ఎట్ ఎఫ్‌డీడీఐ–హైదరాబాద్' పేరిట శనివారం ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.అందులో భాగంగా ప్రభా ఫౌండేషన్ నుంచి 35 మంది విద్యార్థులు, అయిదు మంది అధ్యాపకులతో కూడిన బృందానికి ఆతిథ్యం ఇచ్చింది. యువ ఆశావహులలో సహకారం అభ్యాసాన్ని పెంపొందించడం, డిజైన్‌పై అవగాహనను ప్రోత్సహించడం కోసం ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఎఫ్‌డీడీఐ ప్రతినిధి ఫైజీ మాట్లాడారు. అనంతరం పాదరక్షలు, ఫ్యాషన్, జీవనశైలి, ఉత్పత్తి రూపకల్పన సాధనాలు, సాంకేతికతను వివరించారు.

జేసీపీఆర్‌డబ్ల్యూఏ ప్రధాన కార్యదర్శిగా కైలాష్

రాయదుర్గం: జేసీపీఆర్‌డబ్ల్యూఏ ఎగ్జిక్యూటివ్ కమిటీ సమావేశం శనివారం గచ్చిబౌలి డివిజన్ గోపన్‌పల్లి జర్నలిస్టు కాలనీలోని సొసైటీ కార్యాలయంలో జరిగింది. ఈ సమావేశంలో ఇప్పటి వరకు కొనసాగిన జీడబ్ల్యూ ప్రభాకర్‌రావును తొలగిస్తూ, అతని స్థానంలో ప్రస్తుతం జాయింట్ సెక్రెటరీగా పనిచేస్తున్న కైలాష్‌కు బాధ్యతలను అప్పగిస్తూ నిర్ణయం తీసుకుంది. ఈ సమావేశంలో జగన్నాథ్‌శర్మ, ఆర్ గురువారెడ్డి, సీఆర్ గౌరిశంకర్, కె కైలాష్, నర్సింహ, ప్రశాంత్ రెడ్డి, టి సురేందర్, సైదారెడ్డి పాల్గొన్నారు.

స్వయం సంమృద్ధికి బాసటగా..

ఆ దిశగా శిక్షణ ఇస్తున్న ఎఫ్‌డీడీఐ-హెచ్



టోపీల తయారీపై శిక్షణ ఇస్తున్న డాక్టర్ రాంబాబు

- తాజాగా గోనె టోపీలు.. చెప్పుల తయారీపై శిక్షణ
- ఇంటి వద్దే మహిళల స్వయం ఉత్పత్తులు

రాయదుర్గం: మహిళలకు శిక్షణ ఇవ్వడంలో ఎఫ్‌డీడీఐ–హెచ్ ముందుంటోంది. వారు స్వయం ఉపాధి అవకాశాలు పొందేలా తగిన తర్ఫీదు ఇస్తోంది. ఇప్పటికే కొన్ని శిక్షణ కార్యక్రమాలు సైతం నిర్వహించింది. తాజాగా మహిళలకు ఉచితంగానే శిక్షణ ఇచ్చేందుకు రాయదుర్గంలోని ఫుట్‌వేర్ డిజైన్ అండ్ డెవలప్‌మెంట్ ఇనిస్టిట్యూట్–హైదరాబాద్ (ఎఫ్‌డీడీఐ–హెచ్) ఫ్యాకల్టీ డాక్టర్ రాంబాబు సిద్ధమయ్యారు. మహిళలు ఇంటి వద్దే ఉంటూ వివిధ రకాల డిజైన్లతో కూడిన వస్తువులను తయారు చేసేలా వారికి శిక్షణ ఇవ్వాలని సంకల్పించారు. ఎఫ్‌డీడీఐ–హెచ్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ తేజ్‌లోహిత్‌రెడ్డి ప్రత్యేక చొరవ, ఇతర ఫ్యాకల్టీ ప్రతినిధుల సహకారంతో రెండు తెలుగు రాష్ట్రాలలో శిక్షణా కార్యక్రమాలు నిర్వహించేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నారు. అందులో భాగంగా ఇప్పటికే



సాధారణ చెప్పల తయారీపై మహిళలకు శిక్షణ ఇస్తున్న డాక్టర్ రాంబాబు



జ్యూట్ బ్యాగులు, ఐటీ మహిళా ఉద్యోగులు ఉపయోగించేలా తయారు చేయడంపై మహిళలకు రెండు రాష్ట్రాల్లో శిక్షణ ఇచ్చారు. తాజాగా గోనె టోపీలు, చెప్పులు, అలాగే సాధారణ చెప్పులను తయారు చేయడంపై మహిళలకు శిక్షణ ఇస్తున్నారు.

- శిక్షణ సందర్భంగా నేర్చుకున్న నైపుణ్యాలను బట్టి గంట నుంచి రెండు గంటల సమయంలోనే ఒక గోనె టోపీని తయారు చేస్తున్నారు.
- గ్రామీణ ప్రాంతాలలో వారు అధికంగా ఆసక్తి చూపే చెప్పులను తయారు చేయడంపై ప్రత్యేక శిక్షణ ఇవ్వడానికి ఏర్పాట్లు చేశారు.

పది మంది మహిళలుంటే..



మహిళలకు ఉచితంగా శిక్షణ ఇచ్చి వారి కాళ్లపై వారు నిలబడేలా పలు శిక్షణా కార్యక్రమాలను నిర్వహించాలని తలపెట్టాం. జ్యూట్, ఇతర రకాల బ్యాగుల తయారీపై ఇప్పటికే రెండు తెలుగు రాష్ట్రాలలో ఉచిత శిక్షణ ఇచ్చాం. తాజాగా గోనె హ్యాట్, సాధారణ రకం చెప్పుల తయారీపై శిక్షణ ఇచ్చేందుకు ఏర్పాట్లు చేశాం పదిమంది మహిళలు ఉంటే వారికి శిక్షణ ఇచ్చి తయారు చేసేలా చూస్తాం.

– డాక్టర్ రాంబాబు, ఫ్యాకల్టీ ఎఫ్‌డీడీఐ, హైదరాబాద్ రాయదుర్గం

అలరించిన నృత్య ప్రదర్శనలు



మాదాపూర్: కళాకారులు కూచిపూడి, భరతనాట్య ప్రదర్శనలతో సందర్శకులను అలరించారు. శిల్పారామంలో నిర్వహించే వారాంతపు కార్యక్రమాలలో భాగంగా శనివారం బెంగుళూరుకు చెందిన భరతనాట్య కళాకారిణి మేకల అగ్నిహోత్రి పుష్పాంజలి, నవరస శ్లోకం, దరువు వర్ణం, అంతఃపుర గీతం, ఆనంద నటన తదితర అంశాలను ప్రదర్శించి ఆకట్టుకున్నారు. శ్రీదేవి ప్రశాంత్ శిష్యబృందం కూచిపూడి నృత్యప్రదర్శనలో భాగంగా మూషికవాహన, బ్రహ్మాంజలి, అలరులు కురియగా, దశావతార శబ్దం, నీలి మేఘ శరీర తదితర అంశాలను ఇరా, ఊర్మిళ, గీతికా, చార్వి, దియా, నైనికా, నిషిద్ధ, జాహ్నవి, అనూష, తనుశ్రీ, గోవర్ధిని ప్రదర్శించారు.



ప్రతి చెరువును అభివృద్ధి చేస్తాం: ఎమ్మెల్యే



పటేల్ చెరువు సుందరీకరణ పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే గాంధీ

మియాపూర్: నియోజకవర్గంలోని ప్రతి చెరువును అభివృద్ధి చేస్తామని ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ పేర్కొన్నారు. మియాపూర్‌లోని పటేల్‌చెరువు, మక్తమహబూబ్‌పేట పెద్దకుడి చెరువు సుందరీకరణ పనులను కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్‌తో కలిసి శనివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...నియోజకవర్గంలోని 64 చెరువులున్నాయని ప్రతి చెరువు మంచినీటితో కళకళలాడేలా చర్యలు తీసుకుంటామన్నారు .కార్యక్రమంలో ఐటీ సంస్థ ప్రతినిధి చైతన్య, కాలనీ అసోసియేషన్ సభ్యులు, కాలనీవాసులు పాల్గొన్నారు.

కాయిదమ్మకుంట చెరువు పనులు పరిశీలన

చందానగర్: శేరిలింగంపల్లి నియోజకవర్గంలోని చెరువులను పునరుద్ధరిస్తామని ఎమ్మెల్యే గాంధీ పేర్కొన్నారు. శనివారం హఫీజ్‌పేట్ డివిజన్ పరిధిలోని కాయిదమ్మకుంట చెరువును అధికారులతో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ త్వరితగతిన పనులు పూర్తి చేసి ప్రజలకు అందుబాటులో తీసుకువస్తామన్నారు. చెరువులను సంరక్షించడంలో ప్రతి ఒక్కరు బాధ్యతగా ఉండాలన్నారు.



సంఘీభావ ర్యాలీ

మాదాపూర్: పాక్-భారత్ యుద్ధంలో వీర మరణం పొందిన భారత జవాన్ మురళీనాయక్‌కు బీఏఐ ప్రతినిధులు శనివారం నివాళులర్పించారు. మాదాపూర్‌లోని బీఏఐ (బిల్డర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా) ఆధ్వర్యంలో భారత్‌కు సంఘీభావ ర్యాలీ నిర్వహించారు.ఈ సందర్భంగా బీఏఐ హైదరాబాద్ చైర్మన్ శ్రీనివాసరావు మాట్లాడుతూ పాక్ ఉగ్రవాదులను పెంచి పోషిస్తుందన్నారు. కార్యక్రమంలో బీఏఐ మాజీ అధ్యక్షుడు ఎస్ఎన్‌రెడ్డి, శీనయ్య, ఉపాధ్యక్షుడు డివిఎస్ రెడ్డి, టిఏ రాష్ట్ర చైర్మన్ వి.సురేందర్, మాజీ ట్రస్టీ సచ్చిదానందరెడ్డి పాల్గొన్నారు.

ఘన నివాళి

చందానగర్: పాక్ -భారత్ యుద్ధంలో ప్రాణాలు కోల్పోయిన మురళీనాయక్ చిత్రపటానికి శ్రద్ధాంజలి ఘటిస్తూ శనివారం రాత్రి మియాపూర్ బొల్లారం చౌరస్తా నుంచి ఆల్విన్ కాలనీ చౌరస్తా వరకు ఆపరేషన్ సింధూర్ సంఘీభావ ర్యాలీని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రవికుమార్ యాదవ్ నిర్వహించారు. ఈ ర్యాలీలో అభిరామ్, ప్రభాకర్, లక్ష్మణ్, గణేష్, సురేష్, శ్రీనివాస్, రాము, విజయేందర్, భాష, నాగులు తదితరులు పాల్గొన్నారు.



ర్యాలీలో రవికుమార్ యాదవ్, నాయకులు

మెడికవర్ ఆస్పత్రిలో మాక్ డిజాస్టర్ డ్రిల్

మాదాపూర్: అత్యవసర పరిస్థితులలో సమర్థవంతమైన స్పందన కోసం మెడికవర్ హాస్పిటల్స్ శనివారం మాక్ డిజాస్టర్ డ్రిల్ నిర్వహించింది. అగ్నిప్రమాదం, సామూహిక ప్రమాద పరిస్థితిని ఆధారంగా తీసుకుని ఎలా స్పందించాలో డ్రిల్ ద్వారా వివరించారు. ఈ డ్రిల్‌లో ఆసుపత్రి సిబ్బంది, విపత్తు నిర్వహణ బృందాలు, ఫైర్ సర్వీసు, పోలీస్, అంబులెన్స్ బృందాలు భాగస్వామ్యమయ్యాయి.



అత్యవసర పరిస్థితులలో ఎలా స్పందించాలో ప్రదర్శించారు.



కార్పొరేటర్‌తో మాట్లాడుతున్న కాలనీవాసులు

సమస్యలు పరిష్కరించండి

గచ్చిబౌలి: శేరిలింగంపల్లి డివిజన్ మాధవహిల్స్–2, శిల్పావ్యాలీ కాలనీల్లోని సమస్యలను పరిష్కరిస్తామని కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్ అన్నారు. ఇటీవల నూతనంగా ఎన్నికైన కాలనీ అసోసియేషన్ ప్రతినిధులు నల్లగండ్లలోని కార్పొరేటర్ నివాసంలో కలిసి సమస్యలను వివరించారు. పారిశుద్ధ్యం, వీధిదీపాల సమస్యలను అధికారులకు ఫోన్ ద్వారా తెలిపి వెంటనే తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో గోపినగర్‌బస్తీ అధ్యక్షులు గోపాల్‌యాదవ్, మాధవహిల్స్–2 అధ్యక్షుడు వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శి గోపీచంద్, సంయుక్త కార్యదర్శి విజయ్ కుమార్, సభ్యులు సంతోష్, రామచంద్రారెడ్డి, వెంకట్ శిల్పావ్యాలీ ప్రధాన కార్యదర్శి భవాని, సభ్యులు శివా, సంయుక్త కార్యదర్శి శివారెడ్డి పాల్గొన్నారు.

నేడు ఉచిత కంటి వైద్యశిబిరం

మియాపూర్: ఉచిత కంటి వైద్యశిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే గాంధీ పేర్కొన్నారు. మియాపూర్‌లోని నడిగడ్డతండా గిరిజన సంక్షేమ సంఘం భవనంలో నేడు(ఆదివారం) ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు ఉచిత వైద్య శిబిరం ఉంటుందని తెలిపారు. ఫినిక్స్ ఫౌండేషన్, శంకర కంటి ఆసుపత్రి సౌజన్యంతో శిబిరం ఏర్పాటు చేసినట్టు తెలిపారు. ప్రతి ఒక్కరూ ఆధార్‌కార్డు జిరాక్స్ తో హాజరవ్వాలన్నారు. అలాగే రోజు వాడే మందులను తీసుకురావాలని తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

భవన నిర్మాణాలకు భూములివ్వండి



కాలనీ కమ్యూనిటీ హాల్‌లో అమీన్‌పూర్ పోలీస్‌స్టేషన్



ఉస్మాన్‌నగర్‌లోని మహిళాభవనంలో కొల్లూరు పోలీస్‌స్టేషన్

- తాత్కాలిక భవనాల్లో పీఎస్‌ల నిర్వహణ
- ఇబ్బందులు పడుతున్న పోలీసు సిబ్బంది, స్థానికులు

రామచంద్రాపురం(పటాన్‌చెరు): పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా పోలీస్‌స్టేషన్ భవనాలను నిర్మించడంలో పాలకులు పూర్తిగా విఫలమవుతున్నారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. పటాన్‌చెరు నియోజకవర్గంలో అనేక పోలీస్‌స్టేషన్‌లు తాత్కాలిక భవనాల్లో ఉండటమే ఇందుకు నిదర్శనం. కొన్ని పోలీస్ స్టేషన్లకు భూములు లేక, సొంత భవనాలు లేకపోవడంతో అరకొర వసతుల నడుమ నిర్వహిస్తున్నారు. దీంతో అటు పోలీసు సిబ్బంది, ఇటు ఫిర్యాదు చేసేందుకు వచ్చిన ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా పోలీస్ స్టేషన్లకు భూమిని కేటాయించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

అరకొర వసతులు..

ఈ ప్రాంతాలలో అనేక పోలీస్‌స్టేషన్‌లను అరకొర వసతులతో తాత్కాలిక భవనాల్లో నిర్వహిస్తున్నారు. రామచంద్రాపురం పోలీస్‌స్టేషన్‌ను భెల్ యాజమాన్యం నిర్మించిన భవనంలోను, కొల్లూరు పోలీస్‌స్టేషన్ ఉస్మాన్‌నగర్‌లోని మహిళా భవనంలో నిర్వహిస్తున్నారు. ఇక భానూర్ పోలీస్‌స్టేషన్‌ను బీడీఎల్ యాజమాన్యం కేటాయించిన భవనంలో, పటాన్‌చెరు పీఎస్‌ను ఓ పురాతన భవనంలో ఏర్పాటు చేశారు. అమీన్‌పూర్ పోలీస్‌స్టేషన్‌ను ఓ కాలనీలోని కమ్యూనిటీ హాల్‌లో, గుమ్మడిదల, బొల్లారం పోలీస్‌స్టేషన్లను, తాత్కాలిక భవనాల్లోను, జిన్నారం పోలీస్‌స్టేషన్‌ను ఓ పాతభవనంలో నిర్వహిస్తున్నారు.

పెరుగుతున్న జనాభా..

ఈ ప్రాంతంలో అనేక కాలనీలు వస్తున్నాయి. గతంలో కన్నా పదింతలు జనాభా పెరిగింది. పెరుగుతున్న జనాభాను దృష్టిలో పెట్టుకుని పలు పోలీస్ స్టేషన్‌లు ఏర్పాటు చేశారు. కానీ, అందుకనుగుణంగా మౌలిక సదుపాయాలను కల్పించలేదు. దాని కారణంగా పోలీసులకు, ప్రజలకు ఇబ్బందులు తప్పడంలేదు.

భూములు కేటాయించండి

పటాన్‌చెరు నియోజకవర్గంలోని అనేక ప్రాంతాలు అభివృద్ధి చెందుతున్నాయి. దానికనుగుణంగా పాలకులు ప్రభుత్వం వివిధ శాఖల భవనాల కోసం భూములను కేటాయించి కోట్లాది రూపాయల నిధులతో ఆధునిక భవనాలను నిర్మిస్తున్నారు. కానీ, పోలీస్‌స్టేషన్‌లకు భూములను కేటాయిస్తామని హామీలు ఇస్తున్నారే తప్ప ఆచరణలో పెట్టడం లేదు. ఇప్పటికైనా పోలీస్‌స్టేషన్ నూతన భవనాల నిర్మాణం కోసం భూములను కేటాయించాలని స్థానికులు కోరుతున్నారు.ఇక పోలీస్‌స్టేషన్‌కు ఎక్కువ మంది ప్రజలు వస్తే రోడ్లపైనే నిలబడాల్సి వస్తోంది. వాహనాల పార్కింగ్ కష్టంగా మారుతుంది.

నిర్లక్ష్యం ఎందుకు..?

పోలీస్‌స్టేషన్ భవనాల నిర్మాణం కోసం భూములను కేటాయించడంలో పాలకులు ఎందుకు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారనే ప్రశ్న అటు పోలీసుల్లోనూ ఇటు ప్రజల్లోనూ కలుగుతోంది. గతంలో రామచంద్రాపురం పోలీస్‌స్టేషన్ కోసం మూసేసిన శ్రీనివాస్ థియేటర్ పక్కన స్థలాన్ని గత పాలకులు, స్థానిక ప్రజాప్రతినిధులు పరిశీలించారు. అలాగే కొల్లూర్, గుమ్మడిదల, పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్‌ల కోసం భూములను చూశారు. కానీ ఇప్పటికీ భూముల విషయంలో పురోగతి లేదు.



తాత్కాలిక భవనంలో గుమ్మడిదల పోలీస్‌స్టేషన్

ఆధునికీకరించాలి



పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా పోలీస్‌స్టేషన్‌లను అభివృద్ధి చేయాలి. అందుకు ప్రభుత్వం భూములను కేటాయించి ఆధునిక పోలీస్‌స్టేషన్ భవనాలను నిర్మించాలి.

-ఈశ్వరగారి రమణ, తెల్లాపూర్ నైబర్‌హుడ్ అసోసియేషన్ అధ్యక్షుడు

వ్యసనాలకు బానిసలై దొంగతనాలు

- బెదిరించి సిగరెట్ బాక్సులు ఎత్తుకెళుతున్న నలుగురు అరెస్ట్
- రూ.3లక్షల 50వేల సరుకు, ద్విచక్ర వాహనం స్వాధీనం
- కేసు వివరాలను వెల్లడించిన ఏసీపీ శ్రీనివాస్‌కుమార్



సిగరెట్ బాక్సులను పరిశీలిస్తున్న ఏసీపీ శ్రీనివాస్ కుమార్

మియాపూర్: గతంలో జైలుకు వెళ్లొచ్చినా వారి బుద్ధి మారలేదు.. తిరిగి దొంగతనాలకు పాల్పడుతున్న వారిని మియాపూర్ పోలీసులు అరెస్ట్ చేసి వారి వద్దనుండి రూ.3లక్షల50వేలు విలువ చేసే సిగరెట్ బాక్సులను స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించారు. శనివారం మియాపూర్ పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఏసీపీ శ్రీనివాస్ కుమార్, సీఐ క్రాంతికుమార్, కొల్లూర్ సిఐ కె. రవీందర్, డిఐ రమేష్ నాయుడుతో కలిసి కేసు వివరాలను వెల్లడించారు. వివరాలిలా.. ఒకరు కానిస్టేబుల్‌గా మరొకరు జైలు వార్డెన్‌గా పనిచేస్తూ చెడు వ్యసనాలకు బానిసలై మరో ఇద్దరితో కలిసి క్రైమ్ బ్రాంచ్ పోలీసులమని చెప్పి సిగరెట్ సప్లై చేస్తున్న వ్యక్తుల నుండి సిగరెట్ బాక్సులను ఎత్తుకెళ్లేవారు. ఒకసారి పట్టుపడి సస్పెండై జైలుకు వెళ్లి వచ్చాక కూడా మరలా దొంగతనాలకు పాల్పడుతున్న.. సికింద్రాబాద్ వారాసిగూడకు చెందిన గాయిని శ్రీకాంత్(36), కడప జిల్లా దువ్వూ రుకు చెందిన చిదిరి అమర్‌నాథ్(41). మల్కాజిగిరి దయానంద్ నగర్‌కు చెందిన ఎండీ. ఇమ్రాన్‌ఖాన్(32), మలక్‌పేట్ మూసారంబాగ్ సిరిపురం కాలనీకి చెందిన వాసం శ్రీకాంత్(32) నలుగురు కలిసి ముఠాగా ఏర్పడి దోపిడీలకు పాల్పడుతున్నారు. గాయిని శ్రీకాంత్ కంది జైల్‌లో వార్డెన్‌గా పనిచేయగా, చిదిరి అమర్‌నాథ్ అంబర్‌పేట్‌లో ఉన్న ఏపీ యూనిట్‌లో పోలీస్ కానిస్టేబుల్‌గా పనిచేస్తున్నాడు. చెడు వ్యసనాలు, జల్సాలకు అలవాటు పడ్డ శ్రీకాంత్, అమర్‌నాథ్‌లు ఇమ్రాన్‌ఖాన్, వాసం శ్రీకాంత్‌లతో కలిసి ఐటీసీ సి గరెట్ కేంద్రాల నుండి బాక్సులను దుకాణాలకు సప్లై చేస్తున్న వ్యక్తులను గుర్తించి వెంబడించి ఎవరూలేని ప్రదేశం చూసి వారిని నిలిపివేస్తారు. క్రైమ్ బ్రాంచ్ పోలీసులమని భయపెట్టి బాక్సులు తీసుకెళ్లేవారు. ఈ సరుకును సికింద్రాబాద్, చుట్టుపక్కల దుకాణాల్లో రిటైల్‌గా అమ్మి వచ్చిన డబ్బులతో జల్సాలు చేసేవారు

ఇలా పట్టుపడ్డారు..

గాజులరామారానికి చెందిన శ్రీహరి సిగరెట్ బాక్సులను దుకాణాలకు సప్లై చేస్తుంటారు. ఈ క్రమంలో ఏప్రిల్ 7వ తేదీ సిగరెట్ బాక్సులను తీసుకుని ద్విచక్రవాహనంపై మాతృశ్రీనగర్ కాలనీకి వెళ్తుండగా సాధనా స్కూల్ సమీపంలో శ్రీకాంత్, అమర్‌నాథ్‌లు వాహనంపై వచ్చి శ్రీహరిని అడ్డుకున్నారు. పోలీసులమంటూ బాక్సుల్లో గంజాయి ఉందని తనిఖీ చేయాలని పరీక్ష కేంద్రానికి తీసుకువెళుతున్నామంటూ రూ.లక్ష50వేల సరుకును ఎత్తు కెళ్లారు.అదేవిధంగా గత సంవత్సరం నవంబర్ 28వ తేదీ కొల్లూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో తెల్లాపూర్ ప్రభుత్వ పాఠశాల సమీపంలో మరో వ్యక్తిదగ్గర నుండి కూడా ఇదే తరహాలో సిగరెట్ బాక్సుల దోపిడికి పాల్పడ్డారు. దీంతో బాధితుడు శ్రీహరి మియాపూర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా మియాపూర్, కొల్లూర్ పోలీసులు సంయుక్తంగా కేసు దర్యాప్తు ముమ్మరం చేశారు. సంఘటన స్థలంలో సిసి కెమెరాలతో పాటు సాంకేతిక పరిజ్ఞానం ఆధారంగా శ్రీకాంత్, అమర్‌నాథ్, ఇమ్రాన్‌ఖాన్, శ్రీకాంత్‌లను గుర్తించారు. వారిని మియాపూర్ పోలీసులు అదుపులోకి తీసుకుని విచారించగా దోపిడీకి పాల్పడింది తామేనని అంగీకరించారు. మియాపూర్, కొల్లూర్ పీఎస్‌లతో పాటు అల్వాల్, సైఫాబాద్ పీఎస్‌ల్లో వీరిపై కేసులు నమోదై ఉన్నాయి. జీడిమెట్ల పోలీస్‌స్టేషన్ పరిధిలో వీరు పట్టుబడి జైలుకు కూడా వెళ్లివచ్చారు. ప్రస్తుతం అమర్‌నాథ్ సస్పెన్షన్‌లో ఉండగా శ్రీకాంత్ అనారోగ్య కారణాలతో సెలవు పెట్టాడు. ఈ కేసును ఛేదించిన కొల్లూర్ సిఐ రవీందర్, మియాపూర్ సిఐ క్రాంతి కుమార్, డిఐ రమేష్ నాయుడు, మియాపూర్ హెడ్ కానిస్టేబుల్ ప్రేమ్‌కుమార్, ఫుల్యా నాయక్, కానిస్టేబుల్స్ చంద్రబోస్, పూర్ణచందర్, సాయి, జగన్‌లను మియాపూర్ ఏసీపీ శ్రీనివాస్ కుమార్ అభినందించారు.